# తెలుగు టీచర్

-పి.పి.వరప్రసాదరావు



స్పెషల్ ఇంగ్లీషు మీడియం స్కూలు క్యాంపస్. ఆ స్కూల్లో టీచరు పోస్టుకని ఇంటర్వ్యూకి వస్తే హెడ్‌మిస్ దగ్గరికో, కరస్పాండెంట్ దగ్గరికో పంపించకుండా ఆ ముగ్గురు టీచర్లూ తన ముందు కుర్చీలు లాక్కుంటూ ఎందుకంత హడావుడి చేస్తున్నారో అర్థం కాలేదు వందనకి.

వాళ్ళలో ఒకావిడ ముందుగా గొంతు సరిచేసుకుని నా పేరు సరళ, హిందీ టీచర్ని... చాలాకాలంనుండి ఇక్కడే పనిచేస్తున్నాను. ఎందువల్లనంటే నాకు ఇంగ్లీషుతో ఎలాంటి చిక్కు లేదు కాబట్టి అంటూ ఎత్తుపళ్ళు తళుక్కుమనేలా నవ్వి 'అవును మీ పేరు' అడిగింది వందనని.

చెప్పింది వందన. గుడ్ నేం అంటూ ఇంగ్లీషులో పొగిడి పక్కనున్నావిడ వైపు చూసింది ఇక నువ్వు అడగమన్నట్లు.

నా పేరు శశి.. శశికళ, తెలుగు టీచర్ని, సరళ మేడం తర్వాత ఈ స్కూల్లో నేనే సీనియర్, ఎందువల్లనంటే నాక్కూడా ఇంగ్లీషుతో ఎలాంటి ప్రాబ్లం లేదు కాబట్టి... అంటూ వొంకర్లు పోతూ 'అన్నట్లు మీరేం చదువుకున్నారు' అనడిగింది.

ఏం చదివింది చెప్పి సర్టిఫికెట్ల ఫైలు అందించబోయింది వందన.

"అక్కర్లేదు... అక్కర్లేదు.. సెప్పారుగా... సాలు" అంటూ సరిగమల్లో మొదటి అక్షరాన్ని ప్రాక్టీసు చేసి మూడో టీచరు వైపు చూసింది 'మిగిలింది నీకు' అన్నట్లు.

వందనకి గందరగోళంగా ఉంది వాళ్ళ వాలకాలు చూస్తుంటే.

వాళ్ళెందుకలా ఒక్కొక్కరు తమని తాము పరిచయం చేసుకుంటూ, చివర్లో పిల్లల్లా చిట్టీ పొట్టీ ప్రశ్నలు ఎందుకేస్తున్నారో అర్థంకాక అయోమయంగా ఉండిపోయింది వందనకి.

ఇంతలో మూడో టీచరు స్వగతం అందుకుంది.

నేను సైన్సు టీచర్ని, నా పేరు అన్నపూర్ణ. మొదట్లో ఇంగ్లీషు టీచరుగా సెలక్టాయ్యా, అపుడు పడ్డ బాధలు చెప్పుకుంటే తీరేవి కాదులే, మరీ ఈ హెడ్‌మిస్‌తో అయితే ఇంకా... అని ఇంకేదో చెప్పబోయి మధ్యలో ఏదో గుర్తుకొచ్చినట్లు నాలిక కొరుక్కుంది.

అప్పటికీ మిగిలిన ఇద్దరు టీచర్లు సైన్సుటీచర్‌కేసి 'డస్టర్ తీసుకుని కొట్టాలి నిన్ను' అన్నట్లు చూస్తున్నారు.

గుటకలు మింగుతూ ఆ తర్వాత అన్నట్లు 'మీ వారేం చేస్తుంటారు' అడిగింది తెలుగు మేడం శశికళ.

ఆ ప్రశ్న అసందర్భంగా అనిపించినా మర్యాదకొద్దీ అకౌంటెంట్ అంటూ కూల్‌గానే సమాధానం ఇచ్చింది వందన.

ఆ తర్వాత ముగ్గురు టీచర్లు లేచి దూరంగా వెళ్ళి నించొని పెళ్ళి సంబంధాల్లో కట్నం సంగతులు మాట్లాడుకున్నట్లు వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

అకౌంటెంట్ అయినా ఫర్లేదు, ఆయన చేసే పని కూడా టిక్కులు పెట్టడమేగా, పేపర్లు దిద్దడానికి ఆ మాత్రం నాలెడ్జి సరిపోతుంది.

అన్నట్లు మీరు మరీ ఓవర్ చేస్తున్నారు, ఈ ఒక్క ఆవిడ కూడా వెళ్ళిపోతే ఆ హెడ్‌మిస్ సంగతి తెల్సిన వాళ్ళెవరూ ఈ చుట్టుప్రక్కలకి కూడా రారు, ఆ తర్వాత పేరెంట్స్‌తో రోజూ యుద్ధం చేయాల్సింది మనం, అంతేగాదు ఆ ఇంగ్లీషు క్లాసులు మీరే తీసుకోవలసి వస్తుంది అంటూ సైన్సు టీచర్‌కి ఆముదం త్రాగించినంత పనిచేసింది హిందీ మేడం.

దూరంగా వెళ్ళి అంత రహస్యంగా వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో అస్సలు అర్థంకాలేదు వందనకి.

అంతలో హిందీ మేడం మళ్ళీ పరిగెత్తుకుంటూ వచ్చింది.

ఏమీ అనుకోకండి, చివరి క్వొశ్చన్ అడగడం మరిచిపోయాను అన్నట్టు మీకు ఇంగ్లీషు చదవడం, చూసి రాయడం వచ్చుగా అడిగింది వందనని.

'వచ్చు' అని వెంటనే సమాధానం ఇచ్చి చూసి రాయడమేమిటి? అనుకుంటూండగానే ... అది, మీకు చూడకుండా రాయడం వచ్చి ఉంటే ఓకే, ఒకవేళ అలా రాకున్నా చూసి అయినా సరే ఇంగ్లీషు రాయగలుగుతారు కదా అని అడిగాం అంతే అంటూ అదో రకంగా చూసి నవ్వింది హిందీ మేడం.

వందనలో అంతర్మథనం అలా కొనసాగుతూనే ఉంది. ఏం జరుగుతోంది?

టీచరు పోస్టుకని ఆ స్కూల్లో అడుగుపెట్టింది. వచ్చింది మొదలు వాళ్ళేం చేస్తున్నారో అర్థంకావట్లేదు. అదే సంగతి వాళ్లనే అడిగిపారేస్తేనే కరెక్టనిపించే వేళకి ముగ్గురు టీచర్లు వాళ్ళే కదిలివచ్చారు.

సో వందనగారూ, ఉదయం నుండీ ఈ ఒక్క పోస్టుకు 24మంది ఇంటర్వ్యూకి వచ్చారు. అయినాసరే వాళ్ళందరికంటె మీరే బెటరనిపించి మిమ్మల్నే సెలెక్టు చేస్తున్నాం అంటూ ముక్తకంఠంతో పలికారు ముగ్గురూ.

వందనకి దాంతో ఇంకా పిచ్చెక్కిపోయింది. అనుమానంగా ఇంకేదో అడుగబోయేసరికి హెడ్‌మిస్ దగ్గరికి వెళ్ళకుండానే ఇదేమిటి? అని కదూ మీ డౌట్... అది కూడా వినండి. ఆవిడకి ఎవ్వరూ ఒక పట్టాన నచ్చరు, దాంతో 3 నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. పేరెంట్స్ ఒకటే గొడవ, చివరికి నిలదీసి మేమే అడిగితే ఆ టీచర్ని సెలెక్టు చేసే బాధ్యత మాకే అప్పగించింది... అన్నారు.

అప్పటికి విషయం కొంచెం అర్థమయింది వందనకి.

ఒక పక్క తాను సెలక్టయిపోయినందుకు సంతోషంగాను, తృప్తిగాను అనిపిస్తున్నా మనసులో ఎక్కడో ఏదో ఓ మూల ఇంకా వెలితిగానే ఉంది.

అదేమిటో సీరియస్‌గా ఆలోచించే ప్రయత్నం చేస్తుండగానే, స్కూలు పనిగంటలు, పని చేయాల్సిన నిబంధనలు, ఇచ్చే జీతం మొదలైన వివరాలు అవీ చెప్పడం పూర్తిచేసి కాకపోతే చిన్న కరెక్షన్ వందనగారూ అన్నారు ముగ్గురూ.

అది కూడా చెప్పమన్నట్లుగా చూసింది వందన, ఏం చెయ్యాల్నో తోచక..

కంగారు పడకుండా వినండి.. మరేం లేదు.. ఈ స్కూల్లో తెలుగు టీచరు పోస్టు ఖాళీగా ఉందని పేపర్లో ప్రకటన ఇచ్చాం, కానీ నిజానికి ఖాళీగా ఉన్నది ఇంగ్లీషు టీచర్ పోస్టు మాత్రమే. మా హెడ్‌మిస్ దెబ్బకి భయపడి ఇంగ్లీషు టీచరు పోస్టు చేసేందుకు ఈ చుట్టుప్రక్కలకి ఎవ్వరూ రావట్లేదు. అందుకని మేమే కావాలని అలా ప్రకటన ఇప్పించాం. సో మిమ్మల్ని ఇప్పుడు సెలెక్టు చేసింది తెలుగు టీచరు పోస్టుకి కాదు, ఇంగ్లీషు టీచర్ పోస్టుకి.

ఆ మాటతో నెత్తిన పిడుగు పడ్డంత పనయ్యింది వందనకి.

ఇంగ్లీషు టీచర్ పోస్టా!?

అబ్బే, ఇందులో మీరు కంగారు పడాల్సిందేమీ లేదు మేడం. ఎలాగూ మీకు ఇంగ్లీషు చదవడం రాయడం వచ్చు అన్నారు గదా, ఇక మిగిలింది టెక్స్ట్ బుక్ చూసి అల్లుకుపోవడమే. ఇంకేమైనా అవసరమైతే మేమున్నాంగా, దానికెందుకెంత గాభరా, పైగా ఏ స్కూల్లోనయినా ఎవ్వరైనా చేసేదింతే... వెరీ కామన్... అంటూ నచ్చచెప్పడం మొదలుపెట్టారు.

కానీ వందనకి మాత్రం వాళ్ళొదిలేస్తే అక్కణ్నుంచి పారిపోవడమే బెటర్ అనిపించింది. కానీ అలాంటి అవకాశం ఇచ్చేలా లేరు ఆ ముగ్గురూ.

తీసుకొచ్చి తీసుకొచ్చి ఇలాంటి స్కూల్లో ఇంగ్లీ షు టీచరు పోస్టుకు తోశావేంరా భగవంతుడా, నీకు నా మీద అంత కక్ష తీర్చుకోవాలనిపించిందా? ఇంగ్లీషు ఎదురొస్తుంటే పక్కకి వెళ్తూ నెట్టుకొచ్చిన చదువు నాది. కాస్త దయపెట్టి ఆ తెలుగు టీచరు పోస్టు ఇప్పించమని మొరపెట్టుకుంటే, ఈ ఇంగ్లీషు పనిష్మెంట్ వేస్తావా... అనుకుంటుండగానే మరోవైపు భర్త గుర్తొచ్చాడు వందనకి.

కష్టమో, నష్టమో భర్తని కదాని భరిస్తూ వచ్చాను, ఇప్పుడు ఏకంగా స్కూల్లో టీచరుగా చేరి వాళ్ళ లేత బుర్రలు కూడా ఖాళీ చేద్దామనే, వదిలెయ్యవే వాళ్ళని, వాళ్ళేం పాపం చేశారని.. పైన గ్రేడుగా ఉంటుందని ఇంగ్లీషు మీడియం స్కూలు అంటున్నావు, నువ్వు చూస్తే ఇంగ్లీషులో పరమ పూరు... కాకపోతే తెల్గు టీచరు పోస్టు అని చెప్పి గుడ్డిలో మెల్ల లెక్కన నాక్కొంచెం ఊపిరి నిలిపావు... అంటూ పదహారు తిట్టి స్కూలు దగ్గర విడిచి వెళ్ళిన భర్తకి ఏం సమాధానం చెప్పాల్నో తోచలేదు వందనకి.

గొంతెండిపోయినట్లుగా అనిపించి మంచినీళ్ళకోసం చుట్టూ చూసింది.

మీరు అనవసరంగా తొందరపడి ఇలాంటి బంగారు అవకాశాన్ని జారవిడుచుకోకండి, ఎలాగోలా మేనేజ్ చేసుకోండి, ఇంతమాత్రం పోస్టయినా దొరకడం మీరు ఎప్పుడో చేసుకున్న అదృష్టం... కాదని బయటికెళ్తే తెలుస్తుంది.. ప్యూను పోస్టు కూడా దొరకడంలేదు... మంచి నీళ్ళగ్లాసు అందిస్తూ ధైర్యం చెప్పింది పేరు తెలియని ఇంకో టీచరు.

కోరి కోరి కష్టాలు కొనుక్కుని తెచ్చుకోవడం అంటే ఇదేనేమో!? అనిపిస్తోంది వందనకి.

(19వ పేజీ తరువాయి)

మంచి మాటలన్నీ తృణప్రాయంగా కొట్టిపారేసింది. పిల్లలిద్దరూ నిద్రపోయాక ఆ జ్వరంలోనే భర్తకి అసలు విషయం చెప్పి బాధ ఆపుకోలేక పసిపిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది.

తను ఉద్యోగం మానేద్దామనుకుంటున్నానని అసలు విషయం నెమ్మదిగా భర్త దగ్గిర బయటపెట్టింది.

జరిగిన వాటన్నింటికి కోప్పడ్తాడనుకున్న భర్త ఓదార్చాడు.

ఇంగ్లీషు రాకపోవడం నీ తప్పుకాదు వందనా, మొగమాటపడి నువ్వా ఇంగ్లీషు టీచర్ పోస్టు చేయడం తప్పు. మానెయ్. నీ దగ్గిర కావలసినంత తెలివి, టాలెంట్ ఉన్నాయి. ఈ ఉద్యోగం కాకపోతే మరొకటి, నువ్వు ఎక్కడయినా రాణించగలవు. కాకుంటే టీచరుద్యోగం చేయాలనేది నీ చిన్ననాటి కోరిక అని ఒప్పుకున్నాను, బాధపడకు... ఇంగ్లీష్ రాకపోయినంత మాత్రాన మన దగ్గరున్నవన్నీ మాయం అయిపోవు డోంట్ వర్రీ... అన్నాడు.

టీచరుద్యోగం పోబోతున్నా కూడా భర్త ఓదార్పు ఎంతో శక్తినిచ్చింది వందనకి.

:::::

ఇంకో వారంరోజులు గిర్రున తిరిగాయి. వందన ఆ స్కూల్లో చేరి మూడు నెలలు దాటిపోయాయి.

అంత తక్కువ వ్యవధిలోనే ఎన్నాళ్ళ బంధమో అన్నంతగా అల్లుకుపోయింది వందన ఆ స్కూలు వాతావరణానికి.

కష్టం లేకుండా రోజూ భర్త తనని స్కూటర్ మీద వదిలి వెళ్ళేవాడు. సరిగ్గా ఆ వేళకి తనని చుట్టుముడుతూ పిల్లలొచ్చి చేరేవారు. పట్టించుకునే వరకు విష్ చేస్తూ అల్లరి పెట్టేవాళ్ళు. మిగిలిన టీచర్లకంటే తనకి ప్రత్యేకమైన స్థానం ఇస్తున్నట్లుగా ప్రవర్తించేవారు. అది చూసి ఎప్పుడూ మెచ్చుకోని భర్త తనని మెచ్చుకోలుగా చూసేవాడు. ఓసారి గుర్తుగా ఇంటికి తిరిగెళ్ళాక మరీ గుర్తుచేసి గుడ్... కీపిటప్... అన్నాడు.

అప్పుడప్పుడు బాధపడ్డా మరచిపోలేనన్ని మధురానుభూతుల్ని కూడా తనకి మిగిలించిందా స్కూలు.

అలాంటి స్కూలు విడిచి వెళ్ళాల్సి రావడం తన దురదృష్టంగా అనిపించింది వందనకి. తనకిక స్కూల్లో అదే చివరిరోజు అనిపించేసరికి మనసులో చెప్పుకోలేనంత బాధగా అనిపించింది.

క్లాసుకొస్తూనే పిల్లల మొహాల్లోనూ కొట్టొచ్చినట్లుగా అదే భావన కనిపిస్తోంది.

స్కూలు విడిచివెళ్ళక తప్పదు అనుకునేకొద్దీ దిగులుగా అనిపిస్తోంది వందనకి.

పుస్తకం తెరిచింది, మళ్ళీ తెరవబోనేమో కదా! అనుకుంది.

చెప్పాలనుకున్న మాటని పదే పదే మనసులో సిద్ధం చేసుకుని కొంచెం ఊపిరి బిగపట్టుకుని అపుడు నోరు విప్పి బాధగా పలికింది.

ఐ మిస్ యు చిల్డ్రన్.

దానికోసమే ఎదురుచూస్తున్నట్లు పిల్లలు అంతే వేగంతో స్పందించారు.

నో మాం... రియల్లీ వుయ్ మిస్ యు మాం... గుంపుగా వందన దగ్గరికి చేరిపోయారు.

మీరు వెళ్ళొద్దు మాం... వాళ్ళ అభిమానానికి వందనకి కన్నీరాగకపోతోంది.

పిల్లల దృష్టిలో పడకుండా బ్లాక్‌బోర్డు వైపుకి తిరిగి ఏదో రాసే ప్రయత్నం చేస్తూ ఎడమ చేతి వేలి కొసతో కన్నీరు తుడుచుకుంది. అప్పటికీ ఒకటి రెండు బొట్లు రాలిపడ్డాయి.

తనని తనే ఓదార్చుకుంటూ అతి కష్టంమీద మళ్ళీ పిల్లల వైపు తిరిగింది.

డియర్ చిల్డ్రన్, విడిపోవడం అనేది జీవితంలో చాలా సహజం. ఎదిగే క్రమంలో మనతో ఎంతోమంది కలుస్తారు, కొందరు మనతోనే ఉంటారు, కొందరు విడిపోయి వెళ్ళిపోతారు. అప్పుడు బాధగానే ఉంటుంది, కానీ దాన్ని ఫేస్ చేయడమే జీవితం అంటే... ఆ మాటకొస్తే అల్లారు ముద్దుగా బిడ్డల్ని పెంచుకునే కన్న తల్లిదండ్రులు ముసలివాళ్ళయిపోయాక ఏదో ఒక రోజు అంతగా ప్రేమించిన బిడ్డల్ని వదిలేసి ఈ లోకమే విడిచి మరో లోకానికి వెళ్ళిపోతారు.



**ఇంగ్లీషు రాకపోవడం నీ తప్పుకాదు వందనా, మొగమాటపడి నువ్వా ఇంగ్లీషు టీచర్ పోస్టు చేయడం తప్పు. మానెయ్. నీ దగ్గిర కావలసినంత తెలివి, టాలెంట్ ఉన్నాయి. ఈ ఉద్యోగం కాకపోతే మరొకటి, నువ్వు ఎక్కడయినా రాణించగలవు.**

మీ జీవితంలో నేను ఒకానొక టీచర్ని మాత్రమే, నేను పోతే మీకు ఇంకో టీచరొస్తారు, కానీ నాకు మాత్రం మళ్ళీ మీలాంటి పిల్లలు దొరకరు, ఎందుకంటే ఒకవేళ ఇంకెక్కడయినా టీచరుగా పని చేద్దామనన్నా నాకు ఇంగ్లీషు రాదు కాబట్టి...

దుఃఖం వరదలా పొంగుకొస్తోంది వందన కళ్ళలోకి. హృదయపు చెరువుకు గండిపడి ఆ కన్నీటి ప్రవాసం దుమకడానికి సిద్ధంగా ఉంది.

ఆ పిల్లల్ని విడిచి వెళ్ళడం తనకిష్టంగా అనిపించడం లేదని తాను ఎవరికి చెప్పుకోగలదు, ఎవర్ని బ్రతిమాలుకోగలదు. తనకలాంటి అర్హత లేకుండా చేసింది ఇంగ్లీషు.. అదే తనకిప్పుడు ఏం చేద్దామన్నా అడ్డుకట్టగా నిలుస్తోంది.

కర్చీఫ్‌తోకళ్ళు మొహం తుడుచుకుంటూ టేక్ యువర్ సీట్స్ అంది.

వెళ్ళి ఎవరి సీట్లలో వాళ్ళు దిగులుగా కూర్చున్నారు.

నౌ వుయ్ ఆర్ గోయింగ్ టు లెర్న్.. అంటూ పాఠం మొదలుపెట్టింది.

ఎవ్వరూ గమనించకుండా చాలా సేపట్నుండి ఆ క్లాస్ కిటికీ దగ్గర నించుని హెడ్‌మిస్ అదంతా శ్రద్ధగా గమనిస్తోందన్న విషయం ఎవరికీ తెలీదు.

పిల్లలలా వందన చుట్టూ మూగి నిలబడ్డం, అంత దిగులుగా రిక్వెస్ట్ చేయండి హెడ్‌మిస్‌కి నమ్మశక్యం కాకుండా ఉంది. అంతకుమునుపు ఎప్పుడూ అలాంటి సన్నివేశం చూళ్ళేదు తన స్కూల్లో. వాళ్ళనంతగా కట్టిపడేసిన వందన ప్రవర్తనకి మనసులోనే అభినందనలు తెలపకుండా ఉండలేకపోయింది హెడ్‌మిస్.

ఆ స్కూలుకి వచ్చింది మొదలు వందనని ఓ కంట గమనిస్తూనే ఉంది హెడ్‌మిస్. అంతకుమునుపు టీచర్లకి వందనకి స్పష్టమైన తేడా ఉంది. మామూలుగా టీచర్లంతా చాలా క్యాజువల్‌గా ఐయాం గోయింగ్ టు టీచ్ అంటూ క్లాసు మొదలుపెడ్తారు. కానీ ఇంగ్లీషులో పూర్ అనిపించుకుంటున్న వందన మాత్రం ప్రతి సారీ వుయ్ ఆర్ గోయింగ్ టు లెర్న్ అనే పాఠం మొదలుపెడుతోంది. అదొక్కటే కాదు ప్రతి చిన్న విషయం నుండి పెద్ద పెద్ద విషయాల వరకు ఎంతో తెలివిగా చాకచక్యంగా ఎవరి మనసు నొప్పించకుండా హుందాగా ప్రవర్తిస్తోంది.

ఇంతలో పిల్లల్లో ఎవరో హెడ్‌మిస్‌ని గమనించి చెప్పేసరికి వెళ్ళి మర్యాదగా ఆవిడని లోపలికి ఇన్వైట్ చేసింది వందన. లోనికొచ్చిన హెడ్‌మిస్ వైపు ఏదో చెప్పుకోలేనితనంతో ఆశగా చూశారు పిల్లలు.

తన మనసులో అప్పటివరకు అనుకున్న విషయాల్నే చిన్న చిన్న మాటల్లో వందన ముందు పిల్లలకి చెప్పింది హెడ్‌మిస్.

నిజానికి వందన మేడంలాంటి మీకు నచ్చిన టీచర్ని స్కూలునుండి పంపించెయ్యడం నాకు కూడా ఇష్టంలేదు, కానీ రూల్స్ [illegible]రం తప్పడంలేదు. అంతేకాదు, మీ మేడం నిజా[illegible]గా ఇంగ్లీషు టీచరుగా పనికిరానని ఒప్పుకుని స్కూలు మానుకుంటోంది, ఇక నేను మాత్రం ఏం చేయగలను...

కేవలం హెడ్‌మిస్‌లా ఇంగ్లీషు మాట్లాడలేకపోయినందుకే తనకిష్టమైన ఉద్యోగాన్ని, అనుకోకుండా తన హృదయపు తోటలో అల్లుకుని పూలు పూస్తున్న పిల్లల్ని తను వదులుకోవలసి వస్తున్నందుకు బాధతో తలొంచుకుంది వందన.

భాష తన పాలిట దెయ్యంలా మారింది- కుమిలిపోతూ లోపలోపల అనుకుంది.

పిల్లల్లో ఏ మాత్రం చలనం లేదు.

ఆప్తుల్ని ఎవర్నో పోగొట్టుకున్నట్లుగా ఉంది వాళ్ళ పరిస్థితి.

అఫ్‌కోర్స్, నిజంగా ఇది మీకు చాలా బ్యాడ్ న్యూస్. మీకే కాదు నా క్కూడా, నాకయితే రాత్రంతా నిద్రపట్టలేదు, మొత్తానికి ఈ బ్యాడ్ న్యూస్‌తో పాటు మీ కోసం ఇంకేదైనా గుడ్ న్యూస్ కూడా అందించాలని రాత్రంతా ఆలోచిస్తూనే ఉండిపోయాను... అదేమిటంటే..

ఆ విషయానికి పిల్లలు పెద్దగా స్పందించలేదు, ఎప్పట్లానే దిగులు మొహాలతో ఉండిపోయారు.

అదేమిటంటే రేపటినుండి మీకు ఒక కొత్త తెలుగు టీచర్ని అపాయింట్ చేస్తున్నాను...

పిల్లలు ఇక అవకాశం ఇవ్వలేదు, వాళ్ళ చిట్టి మెదళ్ళు మెరుపు వేగంతో పరిగెత్తాయి.

అవును రేపట్నుంచి మన స్కూల్లో తెలుగు టీచర్‌గా రాబోతున్నది....

వందన మేడం... మిగిలిన సగాన్ని పిల్లలు పూర్తిచేశారు.

ఆనందంతో స్కూలు బెంచీల్ని గట్టిగా చరిచారు.

అవును వందనా! టీచర్‌కి ఉండాల్సింది నాలాగా ఇంగ్లీషు కాదు, నాలెడ్జ్ అంతకంటే కాదు, వాటన్నింటికంటే ముందు పిల్లల్ని తన పిల్లలుగా చూసుకునే అమ్మతనం కావాలి... అని నాకు అర్థమయ్యేలా నువ్వు చేసి చూపించావు, నీలో పిల్లలు అమ్మని చూసుకుంటున్నారు.

నిన్నుచూసి నేర్చుకోవలసింది ఎంతో ఉందని నామనసుకే నిజాయితీగా అనిపించింది. అందుకనే నీలాంటి టీచర్‌ని వదులుకోలేక రాత్రంతా ఆలోచించి ఇలా చేశాను.

ఇకనుండి మన స్కూల్లో ఇంగ్లీషుకి ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో తెలుగుకి కూడా అంతే ఇంపార్టెన్స్ ఇవ్వబోతున్నాం.. నువ్వు నేను కలిసి... ముందడుగు మాత్రం నీ తెలుగుదే.. అంటూ అందరూ తిట్టిపోసుకునే హెడ్‌మిస్ తనని పొగుడుతూ తెలుగులో మాట్లాడ్తుంటే, పట్టరాని సంతోషంతో పిల్లలందరూ తనని చుట్టుముట్టి అభినందనలు తెలుపుతుంటే జన్మ ధన్యమైనట్లు ఆనంద భాష్పాలు మొదలయ్యాయి తెలుగు టీచర్ వందనకి.

★

రచయిత చిరునామా:
**పి.వి.వరప్రసాదరావు**
1-8-35/2, చిక్కడపల్లి, హైదరాబాద్.